సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 7 । అక్టోబర్ । 2025



చెరువు గట్లపై మృత్యు తీగలు
విద్యుదాఘాతానికి చేపల చెరువులపై పనిచేసే బడుగు జీవులు మృత్యువాత పడుతున్నారు. విద్యుత్ తీగలు యమపాశాలుగా మారుతున్నాయి. 8లో



ఎండలో ఎన్ని అవస్థలో
స్కూల్‌గేమ్స్ హ్యాండ్‌బాల్ సెలెక్షన్స్‌కు హాజరైన క్రీడాకారులు కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నిలువ నీడ కోసం వెతుక్కున్నారు. 8లో



ఘాట్ రోడ్డులో దూసుకెళ్లిన కారు
శ్రీవారి కొండపైన ఘాట్ రోడ్డులో ఫుట్‌పాత్ పైకి ఆదివారం రాత్రి ఓ కారు దూసుకెళ్లింది. భక్తులెవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. 8లో

న్యూస్‌రీల్

శాశ్వత పరిష్కారం చూపాలి
జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి



పీజీఆర్‌ఎస్‌లో అర్జీలు స్వీకరిస్తున్న జేసీ

భీమవరం (ప్రకాశంచౌక్) : పీజీఆర్‌ఎస్‌లో అందిన అర్జీలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన, శాశ్వత పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్వో బి.శివన్నారాయణరెడ్డి, డ్వామా పీడీ డా.కే సీహెచ్ అప్పారావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావుతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తంగా 168 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పీజీఆర్‌ఎస్ అర్జీల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. శాఖల వారీగా వచ్చిన అర్జీలను పరిశీలించి తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాలన్నారు. జిల్లా అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ ట్రిబ్యునల్ సభ్యుడు మేళం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానం



అవగాహన ఒప్పందం చేసుకుంటున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక కలెక్టరేట్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం జిల్లాస్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అవార్డు గ్రహీతలకు పురస్కారాలు అందించారు. రాజ్యసభ సభ్యుడు పాక వెంకట సత్యనారాయణ, కలెక్టర్ సీహెచ్ నాగరాణి, ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులు, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

10న పింఛన్ అదాలత్

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక ఎస్‌ఆర్‌కేఆర్ ఆడిటోరియంలో ఈనెల 10న ఉదయం 10 గంటలకు ఏపీ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఎస్.శాంతి ప్రియ ఆధ్వర్యంలో పింఛన్ అదాలత్ నిర్వహించనున్నట్టు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం సర్వీసులో ఉన్నవారు, రిటైర్డ్ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న పింఛన్ మంజూరు, జీపీఎఫ్, మిస్సింగ్ క్రెడిట్ సంబంధించి అన్ని సమస్యలను అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని సూచించారు. దీనిలో భాగంగా ఈనెల 9న పీజీఆర్‌ఎస్ సమావేశం మందిరంలో జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నామన్నారు.

గిరిజనుల అభ్యున్నతికి కృషి చేయాలి
జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్



వేలేరుపాడు: గిరిజనుల అభ్యున్నతికి అధికారులు పాటుపడాలని, సంక్షేమ ఫలాలను గిరిజన కుటుంబాలకు అందేలా చూడాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ అన్నారు. సోమవారం మండలంలోని మోదెల గ్రామంలో మాజీ మంత్రి జలగం ప్రసాదరావుతో కలిసి ఆయన పర్యటించారు. సంక్షేమ, అభివృద్ధి పనులపై గిరిజనులను ఆరా తీశారు. గిరిజన ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు లేని గ్రామాలపై 15 రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని, మూడు నెలల్లో పనులకు శ్రీకారం చుట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. మాజీ మంత్రి జలగం, జేవీఆర్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా గిరిజనులకు స్టీల్ కంచం, గ్లాస్, స్వీట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ పరిస్థితులు చూస్తుంటే అధికారుల వైఫల్యం కనిపిస్తోందన్నారు. ప్రతి గ్రామంలో సెల్ టవర్లు ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. గిరిజన తండాల అభివృద్ధికి త్వరితగతిన అనుమతులు ఇవ్వాలన్నారు. సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన ప్రాంతాలు అభివృద్ధి విషయంలో ఎవరూ కోర్టులకు వెళ్లవద్దని, ఎస్టీ కమిషన్‌ను సంప్రదించాలని కోరారు. ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్, ఇన్‌చార్జి ఆర్డీఓ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం.ముక్కంటి, డీఎఫ్ జి.సతీష్ రెడ్డి, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి జి.త్రినాథ బాబు, విద్యుత్ శాఖ ఈఈ ఫీర్ అహ్మద్ ఖాన్, హౌసింగ్ ఈఈ ప్రసాద్ పాల్గొన్నారు.

ఉసూరుమని పింఛెన్

బురిడీ సర్కార్
- పింఛన్ల ఊసెత్తని కూటమి ప్రభుత్వం
- 15 నెలల్లో కొత్త పింఛన్ ఒక్కటీ మంజూరు చేయని వైనం
- కూటమి సర్కారు వచ్చే నాటికి జిల్లాలో పింఛన్లు 2,32,885
- ప్రస్తుతం 2,26,127కు తగ్గిన వైనం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్ హామీ గాలికి..
- అర్హత ఉన్నా సాయం అందక నష్టపోతున్న పేదలు



సాక్షి, భీమవరం: పేదవర్గాలకు ఆర్థిక భరోసానిచ్చే సామాజిక పింఛన్ల మంజూరును కూటమి సర్కారు విస్మరించింది. 15 నెలల పాలనలో కొత్త పింఛన్ ఒక్కటీ ఇవ్వలేదు. దరఖాస్తుల ఆన్‌లైన్ సైట్‌ను సైతం ఆఫ్‌లోనే ఉంచేసింది. 50 ఏళ్లకే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వృద్ధాప్య పింఛన్ ఇస్తామన్న ఎన్నికల హామీ ఊసే ఎత్తడం లేదు.

వెబ్‌సైట్ క్లోజ్

గత ప్రభుత్వంలో ఏటా జనవరి, జూలై నెలల్లో కొత్త పింఛన్లు మంజూరు చేసేవారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే చాలు రాజకీయాలు, కులమత వర్గాలకు అతీతంగా అర్హులను ఎంపిక చేసేవారు. 2023 జూలై నుంచి డిసెంబరు వరకు వచ్చిన దరఖాస్తులు మేరకు 2024 జనవరిలో జిల్లాలో 4,274 కొత్త పింఛన్లు మంజూరు చేశారు. మరలా జూలైలో కొత్త మంజూరు రావాల్సి ఉంది. జూన్‌లో కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్త పింఛన్ల మంజూరు నిలిపివేసింది. అందుకు సంబంధించిన వెబ్‌సైట్‌ను క్లోజ్ చేయడంతో పాటు దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను నెలల తరబడి నిలిపివేసింది. పింఛన్ల కోసం పేదలు సచివాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండగా ప్రభుత్వం నుంచి తమకు ఇంకా మార్గదర్శకాలు ఏమీ రాలేదని ఉద్యోగులు వారిని వెనక్కి పంపిస్తున్నారు.

వేలల్లో దరఖాస్తులు

వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ తదితర పింఛన్లు కోరుతూ ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్‌ఎస్ కార్యక్రమానికి అధిక సంఖ్యలో పేదలు దరఖాస్తు చేసుకునేందుకు వస్తున్నారు. గతంలో ప్రభుత్వ మార్గదర్శకాలు మేరకు సచివాలయ ఉద్యోగులు వెరిఫికేషన్ చేసి అర్హులైన వారికి ఆన్‌లైన్ చేసేవారు. ప్రస్తుతం సచివాలయ ఉద్యోగులకు లాగిన్ నిలిపివేయడంతో ఆన్‌లైన్ చేసే వీలులేక త్వరలో కొత్త పింఛన్లు వస్తాయంటూ దరఖాస్తుదారులను చెప్పి పంపాల్సి వస్తుందని వారంటున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వలన పింఛన్ సాయం అందక నష్టపోతున్నామని పేదవర్గాల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్పౌజ్ పింఛన్లతో సరి

పేదవర్గాల్లో కుటుంబ యజమాని మృతి చెందితే భార్యకు ఆసరాగా వితంతు పింఛన్ మంజూరు చేయడం పరిపాటి. కాగా జిల్లాలో పింఛన్ తీసుకుంటూ 3,988 మంది లబ్ధిదారులు మృతిచెందగా వారి భార్యలకు మాత్రమే కూటమి ప్రభుత్వం స్పౌజ్ కోటాలో పింఛన్లు అందజేసింది. గతంలో ఎప్పటికప్పుడు స్పౌజ్ పింఛన్లు మంజూరు చేస్తే అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత ఆగస్టులో వీటిని అందజేసింది. స్పౌజ్ పింఛన్లనే కొత్త పింఛన్లు మంజూరు చేసినట్టుగా కూటమి నేతలు హడావుడి చేయడం గమనార్హం. భర్తను కోల్పోయిన పేద మహిళలు ఎంతోమంది వితంతు పింఛన్ సాయం కోసం ఎదురుచూస్తున్నా వారి ఆవేదనను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

50 ఏళ్లకే పింఛన్ హామీ అమలేది?

50 ఏళ్ల నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వృద్ధాప్య పింఛన్ అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు ఊదరగొట్టారు. జిల్లాలో 50 ఏళ్ల నుంచి 60 ఏళ్ల పింఛన్‌కు అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు 2 లక్షల మంది వరకు ఉంటారని అంచనా. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా ఎన్నికల హామీ అమలు దిశగా అడుగులు వేయకపోవడం ఆయా వర్గాల వారిని తీవ్ర నిరాశకు గురిచేస్తోంది.

50 ఏళ్లకే పెన్షన్ ఊసే ఎత్తడం లేదు



కూటమి ప్రభుత్వం దళితులు, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చింది. అయితే ఇప్పుడు వృద్ధాప్య పింఛన్ ఇస్తామన్న ఎన్నికల హామీ ఊసే ఎత్తడం లేదు. పింఛన్ల కోసం సచివాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాల చుట్టూ ప్రజలు ప్రదక్షిణలు చేస్తున్నా ప్రభుత్వం నుంచి తమకు ఇంకా మార్గదర్శకాలు ఏమీ రాలేదని ఉద్యోగులు వెనక్కి పంపిస్తున్నారు.

– ఉండవల్లి జానకి, తణుకు

ఎన్నికల హామీలు పట్టవా?



స్పౌజ్ పింఛన్లనే కొత్త పింఛన్లు మంజూరు చేసినట్టుగా కూటమి నేతలు హడావుడి చేయడం విడ్డూరం. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ తదితర పింఛన్లు కొత్తవి కొర్రీలు లేకుండా మంజూరు చేయాలి. 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వృద్ధాప్య పింఛన్ అందిస్తామని ఎన్నికల సమయంలో ఊదరగొట్టారు. గద్దెనెక్కిన తర్వాత హామీ అమలు దిశగా చర్యలు లేకపోవడం నిరాశ కలిగిస్తోంది.

– వర్ధనపు సుధాకర్, రుస్తుంబాద

నెలనెలా కోత

కూటమి ప్రభుత్వం కొత్త పింఛన్లు ఇవ్వకపోగా ఖజానాపై భారం పడకుండా ఉన్నవాటికి కోత పెడుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2024 జూన్‌లో జిల్లాలో పింఛన్ లబ్ధిదారులు 2,32,885 మంది ఉండగా ఈ అక్టోబరు నాటికి వారి సంఖ్య 2,26,127లకు తగ్గింది. ఈ మేరకు ప్రతినెలా వారికి అందించే సాయం తగ్గుతోందంటున్నారు. ఏడాదిన్నర కాలంలో జిల్లాలో 6,758 పింఛన్లు తగ్గిపోగా సుమారు రూ.20 కోట్లకు పైనే భారం తగ్గించుకుంది.

బాధితులకు పోలీస్ శాఖ భరోసా



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ నయీం అస్మి

భీమవరం: వివిధ సమస్యలతో పోలీస్ కార్యాలయాలకు వచ్చే బాధితులకు పోలీస్ శాఖ భరోసాగా ఉండాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశించారు. సోమవారం భీమవరంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి ఆయా పోలీస్‌స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యమిస్తూ అర్జీలు పునరావృతం కాకుండా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. 16 ఫిర్యాదులు అందగా పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కారం అందిస్తామని భరోసా ఇచ్చారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ కేవీ వీఎస్ సత్యనారాయణ, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ దేశంశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అత్తిలిలో అత్యధిక వర్షపాతం

భీమవరం: జిల్లాలోని 20 మండలాల్లో సోమవారం 370.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా అత్తిలిలో 81 మిల్లీమీటర్లు నమోదుకాగా పెంటపాడులో 52, మొగల్తూరులో 38.4, వీరవాసరంలో 27.8, తాడేపల్లిగూడెంలో 15.2, తణుకులో 2.6, గణపవరంలో 25.4, ఆకివీడులో 1.2 మి.మీ. వర్షం కురిసింది. ఉండిలో 8.6, పాలకోడేరులో 1.6, పెనమంట్రలో 22.2, ఇరగవరంలో 2.2, పెనుగొండలో 18.6, ఆచంటలో 17, పోడూరులో 13.4, భీమవరంలో 15.6, కాళ్లలో 3.8, నరసాపురంలో 9.4, పాలకొల్లులో 13, యలమంచిలిలో 1.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన



భీమవరంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

భీమవరం: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు ప్రభుత్వానికి పట్టడం లేదంటూ కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకుడు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు కనీస వేతనాలు లేక పెరిగిన ధరలతో ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైస్కూళ్లలో ఐదుగురు పనిచేస్తుంటే ముగ్గురికే వేతనాలు ఇస్తున్నారని, 9 ,10 తరగతుల విద్యార్థులను లెక్కల్లోకి తీసుకోకుండా 25 మందికి ఒక జీతం చొప్పున ఇస్తున్నారన్నారు. కూరగాయలు, నిత్యావసర సరకులు ధరలు ఆకాశనంటుతున్నా పాత మెనూ చార్జీలనే అమలు చేయడం దారుణమన్నారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మదీనా బీబీ, నాగమణి మాట్లాడుతూ కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను ప్రభుత్వం అమలు చేసే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గుర్తింపు కార్డులు, యూనిఫామ్స్ లేవని అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నట్టు వాపోయారు. అందరికీ ఉచిత గ్యాస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా కార్యరూపం దాల్చలేదన్నారు. అనంతరం డీఈఓ కార్యాలయ ఏడీకి వినతిపత్రం అందజేశారు.

నేడు కొల్లేరుపై కీలక సమావేశం

కైకలూరు: కొల్లేరు సమస్యల చిక్కుముడులు వీడటం లేదు. కేంద్ర సాధికారత కమిటీ (సీఈసీ) ఈ ఏడాది జూన్‌లో కొల్లేరులో క్షేత్రస్థాయి పరిశీలన చేసింది. సుప్రీంకోర్టుకు నివేదిక అందించాల్సి ఉంది. స్థానిక అటవీ, రెవెన్యూ, డ్రెయినేజీ, పొల్యూషన్ బోర్డు నుంచి పూర్తి సమాచారం చేరకపోవడంతో నివేదిక ఆలస్యం అవుతోంది. ఈ నేపథ్యంలో కొల్లేరు పరిరక్షణకు పర్యావరణ వేత్త మృత్యుంజయరావు వేసిన ప్రజాప్రయోజనాల వాజ్యంపై బుధవారం సుప్రీంకోర్టులో వాదనలు జరగనున్నాయి. ఇప్పటికే ఈ కేసు పలుమార్లు వాయిదాలు పడుతూ వస్తోంది. కొల్లేరు అభయారణ్యంపై పూర్తి సమాచారంతో మంగళవారం ఢిల్లీకి రావాలని ఇప్పటికే ఏలూరు జిల్లా అటవీశాఖ అధికారులకు సీఈసీ నుంచి వర్తమానం వచ్చింది. దీంతో అటవీ అధికారులు దస్త్రాలను సిద్ధం చేసుకున్నారు. రాష్ట్ర అటవీ, పర్యావరణ ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి క్రాంతిలాల్ దండే ఇటీవల నియమితులయ్యారు. రాష్ట్రం తరఫున వాస్తవ పరిస్థితులను కేంద్రం, సీఈసీకి తెలియజేయాల్సిన బాధ్యత ఉండటంతో ఆయన కొల్లేరు అధ్యయనానికి మంగళవారం ఉదయం 10 గంటలకు ఏలూరు కలెక్టరేట్‌కు రానున్నారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, కలెక్టర్ వెట్రిసెల్వి, అటవీ అధికారులతో సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో కొల్లేరు సమస్యలపై రాష్ట్ర అధికారులతో కీలక సమావేశం నిర్వహించనున్నారు.

కమనీయం.. కడు రమణీయం

- నేత్రపర్వంగా చిన వెంకన్న కల్యాణోత్సవం
- నేడు రథోత్సవం



సింహ వాహనంపై తిరువీధి సేవ



ద్వారకాతిరుమల చిన వెంకన్న క్షేత్రంలో వేదికపై కల్యాణ తంతు జరిపిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: సర్వ జగద్రక్షకుడు.. కలియుగ వైకుంఠుడైన శ్రీవారు, నుదుటున కల్యాణ తిలకం, బుగ్గన చుక్కలతో సిగ్గులొలుకుతున్న ఉభయ దేవేరులను పెండ్లాడారు. ద్వారకా తిరుమల చినవెంకన్న ఆలయంలో ఆశ్వయుజమాస దివ్య బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం సోమవారం రాత్రి ఆలయ అనివేటి మండపంలో అట్టహాసంగా జరిగింది. ముందుగా ఆలయం నుంచి సర్వాభరణ భూషితులైన స్వామి, అమ్మవార్లను రెండు వేర్వేరు వాహనాలపై కల్యాణ వేదిక వద్దకు తీసుకుచ్చారు. వేదికపై ప్రత్యేకంగా అలంకరించిన రజిత సింహాసనంపై కల్యాణమూర్తులను ఉంచి అర్చకులు వేడుకను ప్రారంభించారు. వివిధ ఘట్టాలను పూర్తి చేసిన తర్వాత శుభముహూర్త సమయంలో నూతన వధూవరుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపజేసి, మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకను భక్తుల గోవింద నామస్మరణల నడుమ వైభవంగా నిర్వహించారు. దేవస్థానం తరఫున ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్‌వీఎస్‌ఎన్ నివృతరావులు కుటుంబ సమేతంగా శ్రీవారికి పట్టువస్త్రాలను సమర్పించగా, రాష్ట్ర ప్రభుత్వం తరఫున గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. శ్రీహరి కళాతోరణ వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్వామివారు ఉదయం సింహ వాహనంపై, కల్యాణ వేడుక అనంతరం రాత్రి వెండి గరుడ వాహనంపై క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ ఈఓ ఎస్‌వీఎస్‌ఎన్ మూర్తి పర్యవేక్షించారు. విశేష అలంకారాల్లో భాగంగా స్వామివారు మోహినీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పాల్గొన్నారు.



స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు తీసుకువస్తున్న దృశ్యం



కల్యాణ వేడుకను తిలకిస్తున్న భక్తజనం

బ్రహ్మోత్సవాల్లో నేడు
- ఉదయం 8 గంటల నుంచి భజనలు
- ఉదయం 9 గంటల నుంచి భక్తిరంజని
- ఉదయం 10 గంటల నుంచి కూచిపూడి నృత్య ప్రదర్శనలు
- సాయంత్రం 4 గంటల నుంచి నాదస్వర కచేరి
- సాయంత్రం 5 గంటల నుంచి హరికథ
- సాయంత్రం 6 గంటల నుంచి కూచిపూడి నృత్య ప్రదర్శనలు
- రాత్రి 8 గంటల నుంచి రథోత్సవం
- ప్రత్యేక అలంకారం : రాజమన్నార్

బకాయిలు చెల్లించకుంటే ఫ్లాట్లకు తాళాలు

- పాలకొల్లులో టిడ్కో లబ్ధిదారులకు బ్యాంకు అధికారుల హెచ్చరిక
- నోటీసులు అంటిస్తామంటూ హుకుం
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు





టిడ్కో గృహాల వద్ద లబ్ధిదారులను హెచ్చరిస్తున్న బ్యాంకు అధికారులు, లబోదిబోమంటున్న మహిళలు

పాలకొల్లు సెంట్రల్: అధికారంలోకి వచ్చిన వెంటనే శ్రావణమాసంలో టిడ్కో గృహాల లబ్ధిదారులకు ఉచితంగా ఇళ్లు ఇస్తామని చెప్పారు.. రెండు శ్రావణ మాసాలు దాటాయి.. ఇళ్లు ఇవ్వలేదు సరికదా, బ్యాంకు అధికారుల వేధింపులతో టిడ్కో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. సోమవారం పాలకొల్లులోని పెంకుళ్లపాడు టిడ్కో గృహాల్లో లబ్ధిదారుల ఇళ్లకు బ్యాంకు అధికారులు వెళ్లి ఘాటుగా హెచ్చరించారు. ఇళ్ల నిర్మాణం కోసం బ్యాంకు రుణాలు ఇచ్చామని, వాయిదాలు కట్టాల్సిందేనని హెచ్చరించారు. లేకుంటే నోటీసులు ఇచ్చి చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. శుక్రవారం లోపు బకాయిలు చెల్లించాలి లేదా వడ్డీ అయినా కట్టాలని లేదంటే ఫ్లాట్లకు తాళాలు వేస్తామని హెచ్చరించారు. యడ్లబజారు, యూనియన్ బ్యాంకు, ఎల్‌ఆర్‌పేట, పాలకొల్లు ఈఏపీ బ్రాంచ్‌ల నుంచి రికవరీ క్యాంపు నిమిత్తం వచ్చామని బ్యాంకు అధికారులు తెలిపారు. దీంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.

హామీ ఇచ్చి మోసం చేశారు

గత ఎన్నికల సమయంలో టీడీపీకి ఓట్లేస్తే టిడ్కో ఇళ్లు ఉచితంగా ఇస్తామని నాయకులు హామీ ఇచ్చారని, నమ్మి ఓట్లేస్తే ఇప్పుడు మొండి చేయి చూపిస్తున్నారని లబ్ధిదారులు వాపోయారు. ఎమ్మెల్యేని అడిగినా, ఏడాది క్రితం పాలకొల్లు వచ్చిన మంత్రి నారాయణను అడిగినా బ్యాంకు వాయిదాలు కట్టుకోవాలని చెబుతున్నారని, అలా వాయిదాలు కట్టుకునే స్థోమతే ఉంటే ఇక్కడకు వచ్చి ఎందుకు ఉంటామని ప్రశ్నిస్తున్నారు. టిడ్కో గృహాల్లో ఉన్న వారంతా పేద, మధ్యతరగతి కుటుంబాలే అని, తమకు వాయిదాలు కట్టడం భారమని వాపోతున్నారు.

మాకు ఇళ్లు కట్టించింది ప్రభుత్వం

'మాకు ఇళ్లు కట్టించింది ప్రభుత్వం.. బ్యాంకులు కాదు కదా మీరొచ్చి మమ్మల్ని అడుగుతారేంటి.. నాడు మా నుంచి ప్రభుత్వం రూ.లక్ష కట్టించుకుంది.. కానీ రూ.50 వేలకే రిజిస్ట్రేషన్లు చేయించి ఇచ్చారు.. మిగిలిన డబ్బులు సంగతేంటి పోనీ ఆ మిగిలిన డబ్బులైనా జమ వేసుకోవాలి కదా' అంటూ బ్యాంకు అధికారులను లబ్ధిదారులు నిలదీశారు. మిమ్మల్ని ప్రశ్నిస్తే మున్సిపల్ ఆఫీసుకు వెళ్లమంటారు, వారిని అడిగితే బ్యాంకులకు వెళ్లమంటారు, హామీలిచ్చిన నాయకులను అడిగితే కట్టేసుకోండమ్మా అంటున్నారు, మరి అలాంటప్పుడు హామీలివ్వడం ఎందుకంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.

ఫ్లాట్లలో నిర్వహణ లోపం

టిడ్కో ఫ్లాట్లను సరిగా కట్టలేదని, దీంతో పలు ఫ్లాట్లలో నీళ్లు లీకవుతున్నాయని లబ్ధిదారులు అంటున్నారు. అయినా సర్దుబాటు చేసుకుని జీవిస్తున్నామని చెబుతున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా లేవని, పాములు యథేచ్ఛగా తిరుగుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. మా అబ్బాయి మీద ఆధారపడి జీవిస్తున్నానని, బ్యాంకు వాయిదా కింద నెలకు రూ.3,500 చొప్పున చెల్లించాలంటే ఎలా అని ఓ మహిళా లబ్ధిదారులు వాపోయారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలో నియామకాలు


గోలి చంద్రశేఖర్‌రెడ్డి


గోలి శరత్‌రెడ్డి

చింతలపూడి: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మేధావుల విభాగం కార్యదర్శిగా చింతలపూడి పట్టణానికి చెందిన గోలి చంద్రశేఖర్‌రెడ్డిని నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారి చేశారు. ఐటీ విభాగం కార్యదర్శిగా వెలగలపల్లి గ్రామానికి చెందిన గోలి శరత్‌రెడ్డిని నియమించారు.

ఎర్రకాలువ వాటర్ స్పోర్ట్స్ టీం విజయభేరి


జంగారెడ్డిగూడెం ఎర్రకాలువ వాటర్ స్పోర్ట్స్ టీం సభ్యులు

జంగారెడ్డిగూడెం: కర్నూలు జిల్లాలో జరిగిన 4వ రాష్ట్రస్థాయి జలక్రీడల డ్రాగన్ పడవ పోటీల్లో జంగారెడ్డిగూడెం ఎర్రకాలువ వాటర్ స్పోర్ట్స్ టీం సత్తా చాటింది. సీనియన్ మెన్, జూనియర్ బాలుర విభాగాల్లో ఏలూరు జిల్లా తరపున పాల్గొన్న జట్లు అత్యుత్తమ ప్రతిభ కనబరిచాయి. ఈ సందర్భంగా కోచ్‌లు కె.కృష్ణమూర్తి, రాజేష్‌లు మాట్లాడుతూ పోటీల్లో ప్రతిభ చూపి 5 బంగారు పతకాలు సాధించారని తెలిపారు. జట్టులో భాగమైన జంగారెడ్డిగూడెంకు చెందిన టి.సాయిరాం, జి.సాయిరాం, భాస్కర్, పరమాత్మ, జాన్, అఖిల్, పవన్, రెహ్మాన్, లిఖిత్, నిర్మల, నాని, కుమార్, వాసు, రాఖీ, సంతోష్, రూపేష్‌ను వారు అభినందించారు.

గోల్డ్ ఫైనాన్స్ బాధితుల ఆందోళన


చింతలపూడి పట్టణంలో కనకదుర్గ గోల్డ్ ఫైనాన్స్ వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

చింతలపూడి: స్థానిక కనకదుర్గ గోల్డ్ ఫైనాన్స్ బాధితులు తమకు న్యాయం చేయాలని సోమవారం కార్యాలయం ముందు బైఠాయించి ఆందోళన చేశారు. గత నెల 9న సంస్థలో పని చేసే ఆడిటర్ వడ్లమూడి ఉమా మహేష్ సుమారు రూ. 3 కోట్ల విలువైన బంగారు ఆభరణాలతో పరారైన విషయం తెలిసిందే. దీంతో సంస్థ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నారు. ఈ నేపధ్యంలో బంగారం తాకట్టు పెట్టిన తమకు సంస్థ ఇప్పటి వరకు ఎలాంటి హామీ ఇవ్వలేదని, ఫోన్ చేస్తే సమాధానం చెప్పడం లేదని బాధితులు వాపోయారు.

చెరువు గట్లపై మృత్యు తీగలు

- నిర్లక్ష్యంతో బలవుతున్న కూలీలు
- కనీస జాగ్రత్తలు పాటించని యాజమానులు


చేపల చెరువులపై పనిచేస్తోన్న ఒడిశా నుంచి వచ్చిన వలస కూలీలు

కైకలూరు: విద్యుదాఘాతానికి చేపల చెరువులపై పొట్టకూటి కోసం పనిచేసే బడుగు జీవులు పిట్టల్లా రాలిపోతున్నారు. యజమానుల నిర్లక్ష్యంతో మృత్యు తీగలు యమపాశాలుగా మారుతున్నాయి. చెరువు నీటిలో యంత్రాలకు మరమ్మతులు చేస్తున్న సమయంలో కార్మికులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. పశువులకు చెరువు గట్లపై గడ్డి కొస్తున్న కూలీలు గమనించక గడ్డితో పాటు విద్యుత్ వైర్లను కోస్తూ మరణిస్తున్నారు. కొల్లేరు ప్రాంతాల్లో ఇటువంటి మరణాలు నిత్యకృత్యంగా మారాయి.

ఉమ్మడి జిల్లాలో 2.90 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. వీటిలో 1.80 లక్షల ఎకరాల్లో చేపలు, 1.10 లక్షల ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నారు. ఏలూరు జిల్లాలో 4,759, పశ్చిమ గోదావరి జిల్లాలో 16,374 ఆక్వా విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. కైకలూరు నియోజకవర్గంలో ఆక్వా విస్తీర్ణం 84,852 ఎకరాలు కాగా.. ఆక్వా రైతులు 30,972 మంది ఉన్నారు. ఆక్వా రైతులు వాడకాన్ని బట్టి 10 హెచ్‌పీ మోటార్లను వినియోగిస్తున్నారు. రొయ్యల సాగులో నీటిలో ఆక్సిజన్ పెంచడానికి 24 గంటలు ఏరియేటర్లను వినియోగిస్తారు.

లక్షల ఎకరాల్లో చేపల చెరువులకు రోజూ మేతలు కట్టడం, యజమాని పశువులకు మేత కోయడం వంటి పనులకు పలు కుటుంబాలు చేపల చెరువులపై నివాసముంటున్నాయి. చెరువు విస్తీర్ణాన్ని బట్టి భార్యభర్తలకు నెలకు రూ.18 వేల జీతం చెల్లిస్తున్నారు. జనావాసాలకు చెరువులు దూరంగా ఉండటంతో ప్రమాదం జరిగినప్పుడు తక్షణ సాయం అందక మరణాలు ఎక్కువగా ఉన్నాయి. మోటారు చక్రాలలో కొందరు తలలు ఇరుక్కుని మరణిస్తోన్నారు. ఒడిశా, రాజస్థాన్ ప్రాంతాల నుంచి వసల కూలీలు ఎక్కువగా ఇటీవల చెరువు గట్లపై స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. కుటుంబ పోషణ కోసం అధిక అడ్వాన్సు తీసుకోవడంతో పనిభారం పెరిగినా చేయక తప్పని పరిస్థితి.


సర్సాయిపాలెం పుల్లవ డ్రైయిన్ వద్ద విద్యుదాఘాతంతో మరణించిన మాసేన్(ఫైల్)


కైకలూరు మండలం భుజబలపట్నం సమీపంలో చెరువు గట్టుపై విద్యుత్ వైర్లు

ఇవి పాటించాలి

- ఆక్వా రైతులు చెరువులపై నాణ్యమైన మోటార్లు, ఫ్యాన్ సెట్టు వినియోగించాలి.
- అండర్ కేబుల్ వైరింగ్ చేసుకోవడం ఉత్తమం.
- చెరువు వద్ద కనీసం 11 అడుగుల ఎత్తులో విద్యుత్ తీగలు ఏర్పాటు చేయాలి.
- నాణ్యమైన విద్యుత్ వైర్లతో సరైన ఎర్తింగ్ ఏర్పాటు చేసి ఎంసీపీ మీటరు వినియోగించుకోవాలి.
- అవగాహన, అనుభవం లేని వ్యక్తులతో విద్యుత్ పరికరాల మరమ్మతులు చేయించవద్దు.
- విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్స్, మీటర్ల వద్ద మరమ్మతులకు విద్యుత్ శాఖ అధికారిక సిబ్బందిని మాత్రమే ఉపయోగించాలి.
- తడిగా ఉన్న పరికరాలను నేరుగా తాకరాదు. గాలులకు మీ పరిసరాలలో ఏవైనా స్తంభాలు, వైర్లు పడిపోతే వెంటనే విద్యుత్ సిబ్బందికి, సబ్ స్టేషన్‌కు తెలపాలి.
- తడి చేతులతో స్విచ్ బోర్డు ఇతర విద్యుత్ పరికరాలను తాకరాదు.
- మోటర్లకు నాణ్యమైన రేటింగ్ ఉన్న కెపాసిటర్లను వినియోగించాలి.

ప్రజల ప్రాణాలు ముఖ్యం



విద్యుత్ ఎంత ఉపయోగమో అంతే ప్రమాదకరం. ఆక్వా చెరువులపై విద్యుత్ వైర్ల ఏర్పాటులో నిర్లక్ష్యం వల్ల మరణాలు సంభవిస్తున్నాయి. విద్యుత్‌శాఖ పరంగా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. చెరువు నీటిలో విద్యుత్ పరికరాలు మరమ్మత్తుల చేసే సమయంలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలి.

– జీబీ.శ్రీనివాసరావు, విద్యుత్‌శాఖ ఈఈ, గుడివాడ

ఇటీవల కాలంలో ప్రమాదాలు

- కైకలూరు శివారు ఏలూరు రోడ్‌లో పాత్తూరి సుబ్బరాజు అనే యువ ఆక్వారైతు చేపల చెరువు మోటరు స్విచ్ వేస్తున్న సమయంలో విద్యుదాఘాతంతో మరణించాడు.
- కైకలూరు మండలం పెంచికలమర్రులో దుంపగడపకు చెందిన మెరుగుమల్లి శ్రీనివాసరావు విద్యుత్ వైర్లు తగిలి మరణించాడు.
- కైకలూరు మండలం సర్సాయిపాలెం పుల్లవ డ్రైయిన్ వద్ద గేలంతో చేపలు పడుతూ మోటారు వైర్లు తగిలి పశ్చిమగోదావరి జిల్లా శృంగవృక్షంకు చెందిన తానేటి మాసేన్ మృతిచెందాడు.
- నందివాడ మండలం పోలుకొండ వద్ద రొయ్యల చెరువుపై విద్యుత్ వైర్లు తగిలి వేల్పూరి గ్రామానికి చెందిన మల్లేశ్వరరావు మృతి చెందాడు.
- కైకలూరు మండలం భుజబలపట్నంలో చేపల మేతలకు సాయం చేసే క్రమంలో విద్యుత్ వైర్లు తగిలి బోయిన నాగేశ్వరరావు మృతిచెందాడు.
- కలిదిండి మండలం తాడినాడలో కట్టా రంగారావు ఆకులు కొడుతూ మృతిచెందాడు.
- మండవల్లి మండలం దయ్యంపాడులో రొయ్యల చెరువు ఏరియేటర్ల బిగిస్తూ ఘంటసాల భాను మృతి
- కలిదిండికి చెందిన సమయం సుబ్బారావు గడ్డి కోస్తూ విద్యుత్ తీగలు తగిలి మృతి.

బాలికపై అత్యాచారం

యలమంచిలి: యలమంచిలి మండలం కాజ పడమరకు చెందిన బాలికపై పాలకొల్లు మండలం దిగమర్రు గ్రామానికి చెందిన తాడిపర్తి రిషి అత్యాచారం చేసినట్లు కేసు నమోదైంది. బాలిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.గుర్రయ్య తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

ముదినేపల్లి రూరల్: కడుపు నొప్పి భరించలేక పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని వణుదుర్రులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బొర్రా వీరవెంకటేశ్వరరావు(54) మద్యానికి బానిసయ్యాడు. కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 3న ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి పడిపోగా కుమారుడు చూసి చికిత్స నిమిత్తం గుడివాడ ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లాడు. చికిత్స పొందుతూ మరణించినట్లు ఆసుపత్రి వర్గాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆక్వా మినీ లారీ బోల్తా

ఉండి: ఉండి మండల శివారు ఉణుదుర్రు సమీపంలో సోమవారం సాయంత్రం ఆక్వా మినీ లారీ బోల్తా కొట్టింది. తాడేపల్లిగూడెం నుంచి యండగండి వైపు వస్తున్న మినీలారీ రోడ్డు భారీ కోతకు గురైన అదుపు తప్పడంతో లారీ రోడ్డుపైనే బోల్తా కొట్టింది. డ్రైవర్‌తో సహా ముగ్గురు వ్యక్తులు ఉండగా వారికి స్వల్ప గాయాలయ్యాయి.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలుశిక్ష

భీమడోలు: భీమడోలులో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరికి ఏలూరులోని మేజిస్ట్రేట్ 20 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారని భీమడోలు సీఐ యూజే విల్సన్ సోమవారం రాత్రి తెలిపారు. దెందులూరు మండలం ఉప్పుగూడెంకు చెందిన గూడెల్లి జాన్‌బాబు, భీమడోలు పంచాయతీ పరిధిలోని ఆర్జావారిగూడెంకు చెందిన గండి వెంకట్రావులు మద్యం సేవించి వాహనాన్ని నడుపుతున్నట్లు గుర్తించి వారిపై కేసు నమోదు చేసారు.

మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ కమిటీ ఎన్నిక

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేస్తున్న నర్సింగ్ స్టాఫ్, ల్యాబ్ టెక్నీషియన్లు, ఆఫీస్ స్టాఫ్ తదితర విభాగాలలో పనిచేస్తున్న ఉద్యోగ సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ నిరంతరం పోరాడుతుందని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.లక్ష్మణ మూర్తి తెలిపారు. సోమవారం జిల్లా సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా ఎం.రవికుమార్, కార్యదర్శిగా డి.లక్ష్మణమూర్తి, కోశాధికారిగా వి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా టీఎస్ ఆచారి, ఎం.కిషోర్, బి.సందీప్, జి.రాజకుమార్, కే.మణి, కే శేషు, సహాయ కార్యదర్శులుగా పి.అరుణ్ గోపాల్, శేఖర్, ఎం.హరిబాబు, పి.లోకేష్, ఎస్.బీబీ అనురాధ, సీహెచ్ అశోక్ కుమార్ ఎన్నికయ్యారు.


నూతనంగా ఎన్నికైన మెడికల్ ఎంప్లాయీస్ కమిటీ

గిరిజన విద్యార్థులకు మంచినీళ్లు ఇవ్వలేరా?

ఏలూరు (టూటౌన్): పల్లె పల్లెకు మద్యం పంపే ప్రభుత్వం గిరిజన పిల్లలకు మంచినీళ్ళు ఎందుకి వ్వదని పీడీఎస్‌ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.సురేష్ ప్రశ్నించారు. మన్యం జిల్లా కురుపాం గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో విషాదకర సంఘటన గిరిజన విద్యార్థుల జీవితాల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని మరోసారి బహిర్గతం చేసిందన్నారు. ఈ విషాదానికి కారణం పాఠశాలలో రక్షిత మంచినీటి సరఫరా లేకపోవడమేనని చెప్పారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా గిరిజన ఆశ్రమ, గురుకుల పాఠశాలల సమస్యల పరిష్కారానికి ఒక్క చర్య కూడా తీసుకోలేదని విమర్శించారు.

టీఈటీపై రివ్యూ పిటిషన్ వేయాలి

భీమవరం: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీఈటీ) విషయంలో సుప్రీంకోర్టు తీర్పుపై కేంద్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా నాయకులు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను కోరారు. సోమవారం కేంద్రమంత్రిని మంత్రి క్యాంపు కార్యాలయంలో కలసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్‌ఎల్‌వీ చలం, ఎం.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి బి.త్రినాథ్ మాట్లాడుతూ.. విద్యాహక్కు చట్టం 2009 అమలులోకి రాకముందు నియామకం పొందిన ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించేలా ఎన్‌సీటీఈ మార్గదర్శకాలలో సవరణ చేయాలని, పదోన్నతి కోసం ఈవో, జీవో పరీక్షలు పాస్ అవుతున్నామని మరల టెట్ కూడా పాస్ కావాలనే నిబంధనను పునఃసమీక్ష చేయాలని కోరుతున్నట్లు చెప్పారు.


కేంద్రమంత్రి శ్రీనివాసవర్మకు వినతిపత్రం అందిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ఘాట్ రోడ్డులో దూసుకెళ్లిన కారు

ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపైన ఘాట్ రోడ్డులో ఫుట్‌పాత్ పైకి ఆదివారం రాత్రి ఓ కారు దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ భక్తులెవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం.. కారు టోల్ గేట్ మీదుగా కొండపై నుంచి కిందకి వేగంగా వస్తోంది. కేశఖండన శాఖ సమీపానికి వచ్చేసరికి కారు అదుపుతప్పి ఒక్కసారిగా ఫుట్‌పాత్ పైకి దూసుకెళ్లింది. అయితే ఫుట్‌పాత్‌పై భక్తుల సౌకర్యార్థం దేవస్థానం నిర్మించిన పెడస్టల్ షెడ్డు పోల్స్‌ను ఢీకొట్టి కారు నిలిచిపోయింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసం కాగా, షెడ్డు పోల్స్ నేలకొరిగాయి. కారులో ఉన్న వారికి ఏమీ కాలేదు.


శ్రీవారి కొండపైన ఫుట్‌పాత్ పైకి దూసుకెళ్లడంతో దెబ్బతిన్న కారు ముందు భాగం

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కైకలూరు: రెండు బైక్‌లు ఢీ కొనడంతో ముగ్గురు గాయపడ్డ ఘటన కైకలూరు – ఏలూరు రోడ్‌లో వెంకటేశ్వర వైన్స్ ఎదురుగా సోమవారం జరిగింది. కైకలూరు టౌన్ పోలీసుల వివరాల ప్రకారం భీమడోలు మండలం అన్నేవారిగూడెంకు చెందిన కుక్కల ఏసుబాబు, అతని భార్య సుబ్బలక్ష్మీ, అత్త మారుబోయిన వెంకటేశ్వరమ్మతో కలసి ద్విచక్ర వాహనంపై కలిదిండిలో బంధువుల ఇంటికి వెళ్తున్నారు. కైకలూరు ప్రారంభంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ముగ్గురూ గాయపడ్డారు. టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాణసంచా తయారీ కేంద్రాల తనిఖీ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పరిధిలో ఉన్న బాణసంచా తయారీ, నిల్వ కేంద్రాలపై జంగారెడ్డిగూడెం సీఐ ఎంవీ సుభాష్ సోమవారం ఎస్సై జబీర్, సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎస్పీ కేపీఎస్ కిషోర్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించామన్నారు. దీపావళి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో కొందరు అక్రమంగా బాణసంచా తయారీ, నిల్వ లేదా విక్రయాలు చేపడుతున్నట్లు సమాచారం అందిందని, ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందుగా బాణసంచా కేంద్రాలపై తనిఖీలు చేసి నియమ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాణసంచా తయారీకి సంబంధించిన కేంద్రాలు సంబంధిత అధికారుల అనుమతితో మాత్రమే నడపాలన్నారు. అనుమతులు లేని వారు తయారీ లేదా విక్రయాలు చేపడితే ఎక్స్‌ప్లోజివ్ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు అక్రమ బాణాసంచా తయారీ లేదా నిల్వ జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే 112కు లేదా జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎంపికలు

ఏలూరు(ఆర్ఆర్‌పేట): ఏలూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అండర్–14, అండర్–17 బాల బాలికల క్రీడా జట్ల ఎంపికలు నిర్వహించినట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కే.అలివేలు మంగ తెలిపారు. సోమవారం ఇండోర్ స్టేడియంలో అండర్–14, 17 విభాగాల బాలబాలికలకు తైక్వాండో, హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పోటీల్లో 376 క్రీడాకారులు పాల్గొన్నారన్నారు.


పోటీల్లో హ్యాండ్ బాల్ వేస్తున్న విద్యార్థిని

రేషన్ బియ్యం పట్టివేత

లింగపాలెం: మండలంలోని ధర్మాజీగూడెంలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యానును ఆదివారం రాత్రి అధికారులు పట్టుకున్నారు. గ్రామస్తుల తెలిపిన సమాచారం మేరకు తరలిస్తున్న అక్రమ రేషన్ బియ్యంను అధికారులు సీజ్ చేశారు. ధర్మాజీగూడెంలో కార్డుదారుల నుంచి కొనుగోలు చేసిన 10 క్వింటాళ్ల బియ్యంతో పాటు, ఇద్దరు వ్యక్తులను అదుపులో తీసుకున్నట్లు సివిల్ సప్లయిస్ డీఎస్‌ఓ తెలిపారు. బియ్యం తరలించే వారిపై కేసు నమోదు చేసి, వ్యాన్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు.


ధర్మాజీగూడెంలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యాను పట్టుకున్న దృశ్యం

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

భీమవరం: భీమవరం ఒకటో పట్టణంలోని చినపేటలో విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై బి.వై.కిరణ్ కుమార్ తెలిపారు. రోజువారీ కూలిపనులు చేసుకుని జీవనం సాగించే తోట లాజరు (55) స్థానికంగా ఉన్న గుడి సమీపంలో శుభ్రం చేస్తుండగా అరటి చెట్టు విద్యుత్తు తీగలపై పడింది. విద్యుత్తు తీగలు నుంచి షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎండలో ఎన్ని అవస్థలో!


ఎండలో నిలబడి చూస్తున్న విద్యార్థులు


ఎండలో నేలపై కూర్చొన్న విద్యార్థినులు


చెట్టు కింద కాస్త నీడలో


ఎక్కడ నీడ ఉంటే అక్కడే..

క్రీడాకారులకు అన్ని వసతులు కల్పిస్తాం... క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటూ నాయకులు, అధికారులు మాటలు చెప్పడం తప్ప క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. సోమవారం ఏలూరు ఇండోర్‌స్టేడియం గ్రౌండ్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హ్యాండ్‌బాల్ సెలక్షన్స్ జరిగాయి. ఎర్రటి ఎండ, నిలబడటానికి నీడ లేక, కూర్చొవడానికి కుర్చీలు లేక ఇదిగో ఇలా నేలపై విద్యార్థులు కూర్చున్నారు.ఎండలో నిలబడలేక నీడ కోసం వెతుక్కున్నారు. కనీసం టెంట్ కూడా వేయలేదు.

–సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు

వీసీ వ్యవహారంపై విచారణ వాయిదా

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ నియామకం వ్యవహారం వాయిదా పడింది. సోమవారం ఈ అంశంపై చర్చించిన హైకోర్టు దీనిపై విచారణను ఈ నెల 13వ తేదీకి వాయిదా వేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. యూజీసీ ఉపాధ్యాయుల మాదిరిగా యూనివర్సిటీలలో పనిచేసే ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ వయస్సు 62 నుంచి 65 సంవత్సరాలకు పెంచాలని కోర్టులను ఆశ్రయించగా.. కోర్టులు కొట్టి వేశాయి. రాష్ట్ర మత్స్యశాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన శాస్త్రవేత్త ఒకరు వయస్సు పెంపు కోరుతూ సుప్రీం కోర్టులో కేసు వేసినట్టు తెలిసింది. ఈ వ్యవహారం హైకోర్టులో మాత్రమే తేల్చుకోవాలని, ఆరు నెలల్లోనే ముగించాలనే సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇచ్చినట్టు సమాచారం.

కాలువలో పడి వ్యక్తి మృతి

భీమవరం: భీమవరం రెండో పట్టణంలోని లోసరి–గూట్లపాడు పంటకాలువలో పడి వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. భీమవరం సూర్యనారాయణపురానికి చెందిన వి.వెంకట్రామయ్య(50) కాలువలోకి జారిపడగా స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు గాలించి వెలికితీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్ల అభివృద్ధి ఎప్పుడు సారూ..

- గుంతల్లో పడి ప్రమాదాల పాలవుతున్న వాహనదారులు
- అధ్వాన్నంగా మారిన రైల్వే స్టేషన్ రోడ్డు
- కాళ్లు, చేతులు విరుగుతున్నా పట్టించుకోరా అని నిలదీస్తున్న ప్రజానీకం


తణుకు రైల్వే స్టేషన్ రోడ్డులో గుంతల నుంచి తప్పించుకునేందుకు ఇబ్బందులు పడుతున్న వాహనదారులు


తణుకు ఆర్వోబీ కింద కోయాక్సిల్ రోడ్డు మొదటలో ధ్వంసమైన రోడ్డు


తణుకు కొమ్మాయిచెర్వు వంతెనపై గుంతలు పడ్డ రోడ్డు


తణుకు సజ్జాపురం నుంచి జాతీయ రహదారిపైకి వెళ్లే సర్వీసు రోడ్డు దుస్థితి

తణుకు అర్బన్: కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలల కావస్తున్నా రహదారుల అభివృద్ధిని పట్టించుకోవడం లేదని తణుకువాసులు ఆరోపిస్తున్నా రు. ఎన్నికల సమయంలో సంక్రాంతికి ముందే రోడ్లన్నీ అభివృద్ధి చేసేస్తామని భింకాలు పోయిన నేతలు కనీసం ప్యాచ్ వర్కు కూడా చేయడంలేదని విమర్శిస్తున్నారు. రహదారులు ఛిద్రమైపోయి గుంతల్లో వాహనాలు అదుపుతప్పి పడిపోతుండడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు, ప్రయాణికులు వాపోతున్నారు. నిత్యం ఏదోక ప్రాంతంలో వాహనం అదుపుతప్పి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా ఇటు పాలకులు, అటు అధికారులు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా మారిన రోడ్లు..

తణుకు పట్టణంలో ఆర్ అండ్ బీ, మునిసిపల్ పరిధిలోని ప్రధాన రహదారులు గుంత లు పడిపోయి ప్రమాదకరంగా మారాయి. ముఖ్యంగా రాష్ట్రపతి రోడ్డు, మునిసిపల్ కార్యాలయ రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డు, సజ్జాపురం కోయాక్సిల్ రోడ్డు, కొమ్మాయి చెర్వు వంతెన ప్రాంతాల్లో సమస్య తీవ్రస్థాయికి చేరిందని ప్రజానీకం ఆవేదన చెందుతున్నా రు. అధికసంఖ్యలో ప్రయాణాలు చేసే రైల్వే స్టేషన్ రోడ్డు పరిస్థితి అత్యంత దారుణంగా తయారైందని, గోతులపడి రాళ్లలేచిపోయి ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేయాలంటేనే గగ్గోలుపెట్టే పరిస్థితి దాపురించిందంటూ ప్రజానీకం మండిపడుతున్నా రు. ఆర్వోబీ కిందినుంచి కోయాక్సిల్ రోడ్డు, అండర్‌పాస్ మీదుగా జాతీయ రహదారిపైకి వెళ్లే సర్వీ సురోడ్డు నిత్యం పాఠశాలలు, ఆస్పత్రులకు వచ్చే వారితో విపరీతమైన రద్దీగా ఉంటుంది. రోడ్డు పొడవునా గుంతలతో నిండిపోయాయని స్థానికులు చెబుతున్నారు. రహదారులు ఇంత ప్రమాదంగా మారినా కనీసం ప్యాచ్‌వర్కు పనులు కూడా చేయడంలేదని, ఎవరి ఇంటి ముందు వారే గోతులు పూడ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని ఆరోపిస్తున్నారు.

క్లుప్తంగా

రంగయ్యను పరామర్శించిన మాజీ మంత్రి 'కొట్టు'


ఎమ్పీటీసీ రంగయ్యను పరామర్శిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన ఎంపీటీసీ పత్తి రంగయ్య తండ్రి సూర్యారావు ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా సోమవారం వారి కుటుంబాన్ని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పరామర్శించారు. సూర్యారావు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు, కొమ్ముగూడెం సొసైటీ మాజీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్ తదితరులు ఉన్నారు.

కుర్చీల వితరణ

పెంటపాడు: మానవత సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కునాకరపేట అంగన్‌వాడీ కేంద్రానికి 10 కుర్చీలను సోమవారం బహూకరించారు. కేంద్రంలోని చిన్నారులకు పలకలు, పుస్తకాలు, ఇతర విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. మానవత సంస్థ జిల్లా పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మన్ తాడేపల్లి మోహనరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు టి.సంజయ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆపన్నులను ఆదుకోవడం స్ఫూర్తిదాయకం


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న బుషీల్

పాలకొల్లు సెంట్రల్: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో లయన్స్ సేవలు ఎనలేనివని నేజీరియా నుంచి వచ్చిన ఇంటర్నేషనల్ డైరెక్టర్ నడిడే బుషీల్ అన్నారు. సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు సేవా కార్యక్రమాలో బుషీల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు వేసిన పెయింటింగ్‌లను పరిశీలించారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఎల్‌సీఐఎఫ్ ఫండ్‌కు రూ.50 వేలు బుషీల్‌కు అందించారు. రూ.లక్ష విలువ చేసే హోమియోపతి మందులు పంపిణీ చేశారు. విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. తొలుత పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. క్లబ్ జిల్లా గవర్నర్ నిమ్మల పాపారావు నాయుడు, పట్టణ అధ్యక్షులు శిడగం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లఘు కల్యాణం

కాళ్ల: వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి స్వామి అమ్మవార్లకు ఆశ్వయుజ మాస చిన్న కల్యాణ(లఘు కళ్యాణం) మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీ వైష్ణవ ఆగమానుసారం స్వామి వారి కల్యాణ మండపం నందు భీమవరానికి చెందిన మరంగంటి ఝాన్సీ లక్ష్మి వారి కుమారులచే స్వామివారికి అర్చకులు వేద పండితులచే వేదమంత్రాలు నడుమ స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి స్వామి వారి కల్యాణ మహోత్సవం తిలకించారు.

తాడేరు సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం

భీమవరం అర్బన్: తాడేరు విశాల సహకార పరపతి సంఘం త్రి సభ్య కమిటీ సోమవారం మండలంలోని కరుకువాడ బేతపూడిలోని ప్రైవేట్ కన్వెన్షన్ హాల్‌లో ప్రమాణ స్వీకారం సోమవారం చేశారు. చైర్మన్‌గా కొట్టు సురేష్, డైరెక్టర్లుగా జవ్వాది వెంకటేశ్వరావు, కొత్తపల్లి ధైర్య తేజలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, రాజ్య సభ సభ్యుడు పాకా సత్యనారాయణ, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్టు

భీమవరం అర్బన్: భీమవరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. బలరామరాజు తన సిబ్బందితో కొమరాడలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న కోడి సోమకుమార్‌పై దాడి చేసి సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఆయన వద్ద నుంచి 6 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. ఈ దాడులలో ఎస్సైలు పీవీపీఎన్ ఉమా మహేశ్వరరావు, పి. సునీల్ కుమార్‌లు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా చండీహోమం

పాలకొల్లు సెంట్రల్: పౌర్ణమి కావడంతో సోమవారం స్థానిక పంచారామక్షేత్రం క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో చండీహోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, అమ్మవార్లకు కుంకు పూజలు చేశారు. 20 మంది దంపతులు హోమంలో, సాయంత్రం ప్రదోషకాలంలో భక్తులు సప్తసోమవార ప్రదక్షిణల్లో పాల్గొన్నారు. రాత్రి 7 గంటలకు స్వామివారికి పంచహారతుల కార్యక్రమం నిర్వహించారు.

'గూడెం'లో 15.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో గడిచిన 24 గంటల్లో 15.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్ సోమవారం తెలిపారు. కాగా, పెంటపాడు మండలంలో 52.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

మీనవిల్లూరులో ప్రారంభమైన ఆశీర్వాద పండుగలు

పెంటపాడు: మండలం మీనవిల్లూరు గ్రామంలోని కృష్ణ చర్చిలో మూడు రోజుల పాటు నిర్వహించబోయే ఆశీర్వాద పండుగలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సంఘకాపరులు మోషే , మహేష్‌పాల్‌లు ప్రత్యేక ప్రార్థనలు చేసి సమావేశాలను ప్రారంభించారు. మరో రెండు రోజల పాటు, ప్రత్యేక దైవజనులు గుడివాడకు చెందిన డాక్టర్ కిరణ్‌పాల్, భీమవరం మన్నా చర్చికి చెందిన సీనియర్ దైవజనులు దేవదాసు, తదితరులు పాల్గొనే ఈ సమావేశాలను పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దుర్గమ్మ ఆలయంలో నేడు అన్నసమారాధన

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడు కాగులంపాడు రోడ్డులో కనకదుర్గమ్మ ఆలయంలో మంగళవారం ఉదయం నుంచి భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు వీర్ల రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. పరిసర గ్రామ భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేత్రపర్వం.. అమ్మవారి గ్రామోత్సవం


వెండి రథోత్సవం


విచిత్ర వేషాలతో

తాడేపల్లిగూడెం (టీఓసీ): దసరా మహోత్సవాలు ముగింపు సందర్భంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ పంచాయితన క్షేత్రంలోని అమ్మవారికి సోమవారం సాయంత్రం అంగరంగ వైభవంగా పట్టణంలో రథోత్సవం జరిగింది. 58వ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా వాసవి మాతను పట్టణంలో ఊరేగించారు. స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌చే వెండి రథోత్సవాన్ని ప్రారంభించారు. తొలుత ఆర్యవైశ్యులు ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. రథోత్సవ కమిటీ చైర్మన్ నారాయణ రాంబాబు ఆధ్వర్యంలో 175 మంది కళాకారులతో ఊరేగింపు జరిగింది. ఆర్యవైశ్య మహిళలు కలశాలలో ఊరేగింపులో పాల్గొన్నారు. మంగళ వాయిద్యాలతో, గరగ నృత్యాలతో, వీర హనుమాన్, కాళీమాత, వానర మూక, బెంగుళూరు కళాకారులు, కేరళ వాయిద్య బృందం, విచిత్ర వేషధారణలతో, విద్యుత్ లైట్లుతో, బాణాసంచాలతో అమ్మవారి ఊరేగింపు ఘనంగా ప్రధాన రహదారులలో సాగింది. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొర్లపర రాము, నున్న సుందరరావు, బోగవల్లి రమేష్, మారం వెంకటేశ్వరరావు, ఆలపాటి చిన్న, సత్యనారాయణ, వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కనకవయ్యారమ్మకు 126 కాసుల వడ్డాణం


కనకవయ్యారమ్మ అమ్మవారికి సమర్పించిన వడ్డాణాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన కనకవయ్యారమ్మ వారికి గ్రామస్తుల సహకారంతో తయారుచేయించిన 126 కాసుల వడ్డాణాన్ని సమర్పించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని పుట్టినిల్లు అయిన పూరి పాక (మండువా)వద్ద అమ్మవారికి సమర్పించినట్లు గ్రామస్తులు తెలిపారు. మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం పూరి పాక వద్ద అన్నసమారాధన నిర్వహించారు. స్థానికులతోపాటు పరిసర గ్రామాలనుంచి భక్తులు తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఏఎంసీ మాజీ చైర్మన్‌ముప్పిడి సంపత్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు, కొమ్ముగూడెం సొసైటీ మాజీ అధ్యక్షుడు వెలిశెట్టి నరేంద్రకుమార్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ తమ్మిశెట్టి చుక్కయ్య, ప్రత్తి రాజబాబు, ప్రత్తి బాబు, ప్రత్తి రఘు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పనిదినాలను పెంచడం సరికాదు


సమావేశంలో మాట్లాడుతున్న వాసుదేవరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం 8 గంటల పని దినాన్ని 13 గంటలకు పెంచుతూ అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బిల్లును ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ 9వ పట్టణ మహాసభ సోమవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో జవ్వాది శ్రీను, సత్తి కోదండ రామిరెడ్డి, కరక వెంకట్రావుల ఆధ్వర్యంలో జరిగింది. వాసుదేవరావు మాట్లాడుతూ డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరిగే సీఐటీయూ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం, కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని విమర్శించారు. కార్మిక చట్టాలను మార్చారని, నేడు పనిదినాలను నిబంధనలు మార్పు చేయడం సరికాదన్నారు. అధిక ధరలతో, నిత్యావసర వస్తువులు ఆకాశాన్ని అంటుతున్నాయని, కార్పొరేట్ శక్తులకు దేశ ప్రధాని కొమ్మకాయడం దారుణం అన్నారు. దుర్మార్గమైన చర్యలు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి కె.లక్ష్మిఝాన్సీ, పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, కార్మిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పదేళ్ల తర్వాత తెరుచుకున్న లాకర్లు


లాకర్ గదిని తెరుస్తున్న సొసైటీ అధికారులు

పెనుమంట్ర: స్థానిక వ్యవసాయ సహకార సొసైటీ భవనంలో పదేళ్ల క్రితం మూతబడిన సేఫ్ లాకర్ రూమ్ ఎట్టకేలకు రెవెన్యూ, పోలీస్ అధికారుల సమక్షంలో సహకార శాఖ అధికారులు సోమవారం తెరిచారు. సొసైటీ కార్యదర్శి కె.వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం పదేళ్ల క్రితం సొసైటీ అప్పటి కార్యదర్శి అవినీతి ఆరోపణలలో సస్పెండ్ అయ్యారని, నాటి నుంచి లాకర్ రూమ్ తాళాలు సొసైటీకి స్వాధీనం చేయలేదని చెప్పారు. అయితే సొసైటీకి త్రిసభ్య కమిటీ ఏర్పడిన అనంతరం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా గత కార్యదర్శి లాకర్ రూమ్ తాళాలను సొసైటీకి అప్పగించారు. అధికారులు పంచనామ నిర్వహించి లాకర్ రూంను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. సెంట్రల్ బ్యాంక్ గోల్డ్ లోన్స్ ప్రాజెక్ట్ ఉపయోగపడే విధంగా లాకర్లను వినియోగిస్తామని త్రి సభ్య కమిటీ చైర్మన్ జవ్వాది సురేష్, సభ్యులు సత్తి సత్యానంద రెడ్డి, పి.విజయ రమేష్ తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ ఎలియమ్మ, మండల కోపరేటివ్ అధికారి ఎంఎం రెహమాన్ పాల్గొన్నారు.

కృత్రిమ మేధస్సుదే భవిష్యత్

ఆకివీడు: ఆధునిక సాంకేతిక విప్లవంతో ప్రపంచం రోజురోజుకూ కొత్త పుంతలు తొక్కుతోందని ప్రముఖ సాఫ్ట్‌వేర్ ట్రెయినర్ కె.మురళీ కృష్ణ చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం కృత్రిమ మేధస్సుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ కే.సుజాత అధ్యక్షత వహించారు. మురళీ కృష్ణ మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు కంప్యూటర్ విప్లవంలో, భవిషత్ సాంకేతిక రంగంలో దూసుకుపోతుందన్నారు. విద్యుర్థులు మెరుగైన భవిష్యత్ పొందడానికి ఏఐ సాంకేతిక పరిజ్ఞానంపై విద్యాభ్యాసనాన్ని కొనసాగించాలన్నారు. అవగాహనతో పాటు, విజ్ఞానం పెంపొందించుకోవడం ద్వారా భవిష్యత్‌లో మంచి అవకాశాలు పొందవచ్చునన్నారు. ఏఐ పరిజ్ఞానం, పరికరాలు, రెజ్యూమ్ తయారీ, కంటెంట్ తయారీ, పీపీటీ తయారీలో చాట్‌జీప్ట్, పర్‌ప్లెక్సిటీ వంటి సాధనాలను ఎలా ఉపయోగించాలో వివరించారు. ప్రిన్సిపాల్ సుజాత మాట్లాడుతూ విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలన్నారు. విద్యార్థుల జీవితాల్లో ఏఐ కీలక మార్పుల్ని తీసుకువస్తుందన్నారు. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో మంచి ఆరోగ్యం


ఉరదాళ్ల పాలెం గ్రామంలో ఈసీసీఈ సమావేశ దృశ్యం

అత్తిలి: పౌష్టికారహారంతో మంచి ఆరోగ్యం సాధ్యపడుతుందని పలువురు వక్తలు తెలిపారు. అత్తిలి మండలం తిరుపతిపురం సెక్టర్ ఉరదాళ్ల పాలెం గ్రామంలో పోషణ మహోత్సవాలలో భాగంగా ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలక్ష్మి, పర్యవేక్షకురాలు ఎం శ్రీదేవి ఆధ్వర్యంలో ఈసీసీఎస్ సమావేశం నిర్వహించారు. నవచేతన పిల్లలకు విద్యను అందించే విధానాన్ని పోషకాహారం గురించి తెలిపారు. ఆధార శీల విద్యార్థులకు విద్యను అందించే విధానాన్ని పోషకాహారం అందించే విధానం, ప్రీ స్కూల్ పిల్లలకు కార్నర్స్ గురించి తెలియజేశారు. భాషాభివృద్ధి, శరీర అభివృద్ధి, గణితాభివృద్ధి, మేధావివృద్ధి, సాంఘిక అభివృద్ధి, గురించి కూడా వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సీ హెచ్‌ఆర్ కే కుమారి, జీఎస్ జ్యోతి, ఎం వెంకటలక్ష్మి, ప్రి స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు

యలమంచిలి: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ శతాబ్ది ఉత్సవం స్థానిక తమ్మినీడి ఉమా నరసింహ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించారు. ముఖ్యవక్త, సహ శారీరక ప్రముఖ్ ఓలేటి రవి సంఘ ప్రాముఖ్యతను, విధానాలను వివరించారు.

13 నుంచి వీఆర్ఏల నిరసన

నరసాపురం: వీఆర్ఏల సమస్యలపై ఈనెల 13, 14, 15 తేదీల్లో విజయవాడ అలంకార్ సెంటర్లో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్టు సంఘం రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి సుబ్బారావు తెలిపారు. వీఆర్ఏల సంఘం నరసాపురం మండలం కమిటీ సమావేశం సోమవారం నరసాపురంలో రావూరి మాణిక్యాలరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. లోకేష్ పాదయాత్రలో ఇచ్చిన హామీలు లేదా అలంకార్ సెంటర్లో జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొని చేసిన వాగ్దానాలు గాని అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని వేతనాలతో వీఆర్ఏలు అదనపు పని భారం కూడా మోస్తున్నారని తెలిపారు. తప్పని పరిస్థితుల్లో నిరసనకు నిర్ణయించుకున్నట్టు చెప్పారు. నామినీలను వీఆర్ఏలుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, డిమాండ్లతో 13, 14 తేదీల్లో దీక్షలు 15న ధర్నా చేయనున్నట్టు వివరించారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా

పాలకొల్లు సెంట్రల్: తనను వైఎస్సార్ సీపీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ జాయింట్ సెక్రటరీగా నియమించడంపై పట్టణానికి చెందిన ఈరంకి కాశీ విశ్వనాథం సంతోషం వ్యక్తం చేశారు. పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని సోమవారం పేర్కొన్నారు.

నంబరు 13 పాఠశాల చుట్టూ దుర్గంధమే

- తిష్టవేసిన పందులు
- మురికికూపాలుగా ఖాళీ స్థలాలు


తణుకు నంబరు 13 మునిసిపల్ పాఠశాల వద్ద మురికి కూపంగా మారిన ఖాళీ స్థలం

తణుకు అర్బన్: తణుకు బొమ్మలవీధి సమీపంలోని లాల్‌బహదూర్ శాస్త్రి నంబరు 13 మునిసిపల్ ప్రాంతం దుర్గంధానికి, దుర్వాసనకు ఆవాసంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పాఠశాలకు ఎదురుగా, పక్కన గోడను ఆనుకుని ఉన్న పెద్ద ఖాళీ స్థలాలు ఈ దుర్గంధానికి తీవ్ర కారకాలుగా ఉన్నాయని విమర్శిస్తున్నారు.

పాఠశాలను ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో మురికినీరు చేరి మురికికూపంగా మారగా, ఎదురుగా ఉన్న ఖాళీస్థలం మాత్రం మినీ కంపోస్టు మాదిరిగా మారి దుర్గంధాన్ని వెదజల్లుతుందని స్థానికులు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఖాళీస్థలాలు ఏళ్ల తరబడి ఉండడంతో ఈ ప్రాంతంలో చెత్త, వ్యర్థాలు పారవేసే ప్రాంతంగా వినియోగంలోకి మారిపోయాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పందుల తిష్ట...

పాఠశాలకు ఆనుకుని ఉన్న ఈ రెండు ఖాళీ స్థలాల్లోను పందులు తిష్టవేయడంతో దుర్వాసనతో ఉండలేకపోతున్నామని చెబుతున్నారు. ముఖ్యంగా పాఠశాలలో ఉండే 30 మంది విద్యార్థులు ఈ దుర్గంధానికి ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు చెబుతున్నారు. పందుల పెంపకందారులు తమ పందులను ఈ ఖాళీస్థలాల్లో ఉంచి పెంచుకుంటున్నా మునిసిపల్ అధికారులు పట్టించుకోవడంలేదని, గతంలో పందుల సమస్యలేదని ఏడాది కాలంగా పందులతో ఈ ప్రాంతంలో విసిగివేసారిపోతున్నామని మండిపడుతున్నారు. పందులను కూడా దూరంగా ఉంచేలా చర్యలు తీసుకోలేని మునిసిపల్ అధికారులు స్వచ్ఛ ఆంధ్ర అంటూ ప్రచారాలు చేయడం ఎంతవరకు సబబని నిలదీస్తున్నారు.


తణుకు నంబరు 13 మునిసిపల్ పాఠశాల వద్ద ఖాళీ స్థలం


తణుకు నంబరు 13 మునిసిపల్ పాఠశాల వద్ద తిష్ట వేసిన పందులు